MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం


మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 357 | మంగళవారం 2 డిసెంబర్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-




# ప్రభుత్వ భవనాలపై పెద్ద ఎత్తున సౌర విద్యుత్ ఉత్పత్తి



- ఫెర్రో అల్లాయ్స్‌కు మరో ఏడాది ప్రోత్సాహకాలు పొడిగింపు
- తద్వారా ప్రభుత్వంపై రూ.1,053 కోట్ల భారం
- ఆర్టీసీకి త్వరలోనే వెయ్యి ఈవీ బస్సులు
- విద్యుత్ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు మరో ఏడాది పాటు ప్రోత్సాహకా లను పొడిగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో కీలకమైన పరిశ్రమలుగా వీటిని గుర్తించి మరో ఏడాదిపాటు ప్రోత్సాహకాలను పొడిగిస్తున్నట్టు సీఎం ప్రకటిం చారు. తద్వారా ప్రభుత్వంపై రూ.1,053 కోట్ల భారం పడనుంది. మంగళవారం సచివాలయంలో విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితి, పీఎం కుసుమ్, ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద సోలార్ రూఫ్ టాప్ పథకం, విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యయం తగ్గింపు తదితర అంశాలపై ఉన్నతాధికారులతో చర్చించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేకించి విద్యుత్ సరఫరా, పంపిణీ నష్టాలను 2029 నాటికి -

మిగతా3లో



## రేపు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగుల వర్షం

- బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం
- పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం
- రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం కారణంగా నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో బుధవారం అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. అదేవిధంగా కృష్ణా, ఎన్టీఆర్,గుంటూరు, బాపట్ల,పల్నాడు, ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మంగళవారం సాయంత్రం 5 గంటల నాటికి తిరుపతి జిల్లా మల్లంలో 53.5 మిమీ, తడలో 50.7 మిమీ, చిత్తమూరులో 50.2మిమీ, పూలతోటలో 33.5మిమీ వర్షపాతం నమోదైందని తెలిపింది.

## స్నేహపూర్వక పెట్టుబడులకు ఏపీ సరైన గమ్యస్థానం



- ప్రపంచ పెట్టుబడిదారులతో కలిసి పని చేసేందుకు ఏపీ సిద్ధం
- ముంబయిలో జరిగిన 12వ సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్‌లో మంత్రి కందుల దుర్గేష్
- చలనచిత్ర నిర్మాణం, పర్యాటక రంగాలలో ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పెట్టుబడి అవకాశాలను, కల్పించే ప్రోత్సాహకాలు

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

ప్రపంచ పెట్టుబడిదారులతో కలిసి పని చేసేందుకు ఏపీ సిద్ధంగా ఉందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. స్నేహ పూర్వక పెట్టుబడులకు ఏపీ సరైన గమ్యస్థానం అని పేర్కొన్నారు. ముంబయిలో జరిగిన 12వ సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్‌లో మంత్రి కందుల దుర్గేష్ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి చలనచిత్ర పరిశ్రమను, పర్యాట కాన్ని ఎలా ఉపయోగించుకోవాలనే అంశంపై ఇన్వెస్టర్లకు మంత్రి కందుల దుర్గేష్, టూరిజం ఎండీ, ఏపీటీఏ సీఈవో ఆమ్రపాలి కాట దిశానిర్దేశం చేశారు. చలనచిత్ర నిర్మాణం, పర్యాటక రంగాలలో ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పెట్టుబడి అవకాశాలను, కల్పించే -

మిగతా3లో

## అమరావతిలో ఏడు గ్రామాల్లో రెండో విడత భూసమీకరణకు ఆదేశాలు

### సీఆర్డీఏకు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

**(అంకుశం ప్రతినిధి, అమరావతి, డిసెంబర్ 2):**

ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధిలో భాగంగా రెండో విడత భూసమీకరణకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు -

మిగతా2లో



## పార్టీ బలోపేతమే లక్ష్యం

టీడీపీ ఎంపీపీలకు శిక్షణ పూర్తి

- మంగళగిరిలో టీడీపీ ఎంపీపీల రెండ్రోజుల శిక్షణ విజయవంతం
- సూపర్ సిక్స్, సోషల్ మీడియా వినియోగంపై నేతలకు అవగాహన
- సోమిరెడ్డి, కూన రవికుమార్ తదితర సీనియర్ నేతల శిక్షణ

## ఎస్సీ - ఎస్టీలకు ప్రత్యేక నిధులు ఇవ్వాలి

### ఏపీలో రైతులను ఆదుకోండి

### లోక్ సభలో తిరుపతి ఎంపీ గురుమూర్తి విన్నపం




**అంకుశం ప్రతినిధి తిరుపతి: డిసెంబర్ 2**

ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ పశు సంపద అభివృద్ధి మిషన్ అమలు స్థితిగతులు, తిరుపతి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందుతున్న ప్రయోజనాలపై లోక్‌సభలో తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి అడిగిన ప్రశ్నకు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సమాధానం ఇచ్చారు. ఇప్పటి వరకు ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం రూ.113.06 కోట్ల నిధులు కేటాయించగా, అందులో రూ.53.53 కోట్ల నిధులు రాష్ట్రానికి విడుదలైనట్లు ఆయన తెలిపారు. తిరుపతి జిల్లాకు ప్రత్యేకంగా రూ.5.27 కోట్ల నిధులు కేటాయించబడినట్టు సమాధానంలో పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో పథకం అమలు వివరాలను వెల్లడిస్తూ జిల్లాలో 15,553 పశువులకు బీమా చేసి రూ.2.89 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అలాగే రైతులకు 1,463 పశుగ్రాసం మిని కిట్లు పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. పశుసంవర్ధక రంగంలో స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి అందించే కార్యక్రమంలో -

మిగతా2లో

## ప్రతిపక్షాలపై మోదీ వ్యాఖ్యలు అప్రజాస్వామికం

- 11 ఏళ్లల్లో దేశాభివృద్ధి శూన్యం
- రూపాయి విలువ పతనం
- సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ



# ప్రతిపక్షాలపై మోదీ వ్యాఖ్యలు అప్రజాస్వామికం

**అంకుశం ప్రతినిధి విజయవాడ డిసెంబర్ 2**

సాక్ష్యాత్తూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ నేడు ప్రతిపక్షాలను, పార్లమెంట్ సమావేశాలను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యల్ని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ తప్పుపట్టారు. చట్టసభల్లో ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తితే.. అది ఎందుకు డ్రామా అవుతుందో మోదీ సమాధానం చెప్పాలన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా మంగళవారం రామకృష్ణ మాట్లాడుతూ, పార్లమెంట్‌లో మోదీ ప్రతిపక్షాలను ఉద్దేశించి డ్రామాలు ఆడవద్దని, అభివృద్ధిపై చర్చించాలంటూ వ్యాఖ్యలు చేయడం అపహాస్యమన్నారు. 11 ఏళ్ల మోదీ హయాంలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ దేశంలో ఏ రంగాల్లో మనం ముందుకు పోయాం?, ఏ రంగాల్లో వెనుకబాటుకు గురయ్యాం?, మోడీ హయాంలో దేశానికి ఏం అభివృద్ధి జరిగిందని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాలలోను భారత్ ముందుకు పోతోందని మోదీ చెబుతున్నారని, ఇవాళ ప్రపంచ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గిపోయిందన్నారు. 2014లో మోదీ ప్రధాని అయ్యే నాటికి ఒక డాలర్‌కు రూ.60 ఉంటే, ఇవాళ రూ.89.65 పైసలకు చేరుకుందంటే, రూపాయి విలువ ఎలా పడిపోయిందో తెలుస్తుందన్నారు. దానికితోడు అంతర్జాతీయంగా మన అప్పులు పెరిగాయన్నారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు రూ.55 లక్షల కోట్ల అప్పులు ఉంటే, ఇవాళ రూ.200 లక్షల కోట్లకు పెరిగిపోయాయని వివరించారు. ఎన్నికల సమయంలో ప్రధాని ఇచ్చిన వాగ్దానాలు ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదని వివరించారు. మౌలిక సమస్యల్ని ఏ ఒక్కటీ పరిష్కరించలేదని, రైతుల సమస్యలు అలాగే ఉన్నాయని, ధరలను నియంత్రించలేక పోయారని అన్నారు. నిరుద్యోగ సమస్య యథాతథంగా ఉందని, విదేశీ బ్యాంకుల నుంచి నల్లధనం వెనక్కి రప్పిస్తామని ఎన్నికల్లో ఆర్భాటంగా ప్రచారం చేసి.. దానిని నెరవేర్చలేకపోయారన్నారు. కాబట్టి మోదీ ఏమీ చేయలేకపోగా, ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ప్రతిపక్షాలను డ్రామాలాడుతున్నారంటూ అగౌరపరిచేలా వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. ఎస్ఐఆర్ గురించి పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు చర్చించకూడదంటే ఎలా అని ప్రశ్నించారు. మోదీ పదేపదే మతం పేరుతో ప్రజలను విభజించే ధోరణితో వ్యవహరిస్తున్నారని, వాటిపైన ప్రతిపక్షాలు మాట్లాడితే ఓర్చుకోలేక పోతున్నారని అన్నారు. మోదీ స్పష్టంగా పార్లమెంట్‌ను, ప్రతిపక్షాలను అవమానిస్తున్నారని మండిపడ్డారు. కేరళ సీఎం పినరయ్ విజయన్‌పైన, మాజీ ఆర్థికశాఖ మంత్రి థామస్ ఐజాక్‌పైన అక్రమ కేసులు బనాయించడాన్ని రామకృష్ణ తప్పుపట్టారు. నాడు రిజర్వు బ్యాంకు అనుమతితో అక్కడ కార్యకలాపాలు చేస్తే, దానిపై అక్కడ కుంభకోణం జరిగిందని వారిపై కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. కేరళలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల, అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ఎల్‌డీపీను అప్రతిష్ట పాల్జేయడానికి సాక్ష్యాత్తూ సీఎంపైనే కేసులు పెడుతున్నావని తప్పుపట్టారు. మీకు అనుకూలంగా ఉంటే ఒక రకమని, వ్యతిరేకిస్తే వారిపై కేసులతో అణచివేసే చర్యల్ని తప్పుపట్టారు. చివరకు నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలపై సోనియా గాంధీ, రాహుల్ గాంధీపైనా కేసులు పెట్టడాన్ని ఆయన ఖండించారు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న వితండ వైఖర్ని సీపీఐ తరపున ఖండిస్తున్నామన్నారు. వామపక్ష, ప్రజాస్వామ్య వాదులంతా ప్రధాని చర్యల్ని తూర్పారబట్టాలన్నారు. ప్రజాస్వామ్యానికి ఇలాంటి చర్యల ద్వారా ప్రమాదం ఏర్పడుతోందని రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు

# ప్రభుత్వ భవనాలపై పెద్ద ఎత్తున సౌర విద్యుత్ ఉత్పత్తి

-మొదటిపేజీ తరువాయి

9.20 శాతం నుంచి గణనీయంగా తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. విద్యుత్ కొనుగోళ్ల భారం తగ్గించుకునేందుకు ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ ఒప్పందాలు కుదుర్చుకోవాలని సీఎం సూచించారు. పీఎం కుసుమ్ సహా ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పీఎం కుసుమ్ ప్రాజెక్టు కింద 4,792 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని సీఎం సూచించారు. ప్రభుత్వ భవనాలపై సౌర ఫలకలను ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు 483కు పైగా ప్రభుత్వ భవనాలపై సౌర ఫలకలను ఏర్పాటు చేసి 150 మెగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టనున్నారు. ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలు కూడా విద్యుత్ పొదుపు చేసేలా ఉపకరణాలు వినియోగించేందుకు అవగాహనా కార్యక్రమాల్ని చేపట్టాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన సంస్థలు ఐస్(ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ) పాలసీ ద్వారా 60 రోజుల్లోనే తమ కార్యాచరణను ప్రారంభించేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచనలు జారీ చేశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించి అనుమతులు జారీ చేయాలని సీఎం స్పష్టం చేశారు. తద్వారా విద్యుత్ ఉత్పత్తిలో ఏపీ ఓ న్యూ ఎనర్జీ హబ్‌గా మారాలని వ్యాఖ్యానించారు. ఈ రంగంలో వినూత్న ఆవిష్కరణలు రావాల్సి ఉందని అన్నారు. అలాగే విద్యుత్ సంస్థలు రుణ సమీకరణలో వడ్డీ భారాన్ని తగ్గించుకోవాలని సూచించారు. విద్యుత్ కొనుగోళ్లలోనూ వ్యయం తగ్గించుకోవాలని ముఖ్యమంత్రి సూచనలు చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో యూనిట్‌కు 20 పైసల చొప్పున కొనుగోలు వ్యయం తగ్గించినట్టు సీఎస్ కె.విజయానంద్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈపీఎంఎస్ విధానంతో నిరంతరం పర్యవేక్షణ ద్వారా రూ.400 నుంచి 500 కోట్ల మేర పొదుపు



చేయగలిగామని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ ఒప్పందాల ద్వారా కొనుగోలు వ్యయం తగ్గుతుందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిశ్రమలకు, వాణిజ్యం, గహ అవసరాలు, వ్యవసాయ రంగానికి జరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషించాలని.. డిమాండ్‌కు తగినట్టుగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పీఎం కుసుమ్ కింద దేవాదాయ, జలవనరుల శాఖలకు చెందిన భూముల్లో విద్యుత్ ఉత్పత్తి చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. వినియోగదారులే విద్యుత్ ఉత్పత్తి చేయటం ద్వారా తాము వినియోగించుకున్న అనంతరం మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా ఆదాయం ఆర్జించేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగానే సోలార్ రూఫ్ టాప్ పథకం కింద సౌర ప్యానెల్లు ఏర్పాటు చేస్తున్నామని సీఎం తెలిపారు. బీసీ వినియోగదారుకు 3 కిలోవాట్ల వరకూ రూ.20 వేల సబ్సిడీ అమలు చేసేందుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. చేనేతలకు ప్రభుత్వం ప్రకటించిన 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కూడా అమలు చేయాలని ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా మూలధన రాయితీ, జీఎస్టీ మినహాయింపు సహా 9 అంశాలకు ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు. రాష్ట్రంలోని రిజర్వాయర్ల వద్ద పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను జెన్‌కో ఇరిగేషన్ అధికారులతో కలిసి అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల వద్ద పీఎస్పీ ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకుంటే పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి సాధ్యం అవుతుందని అన్నారు. ఐదేళ్లలో ఆర్టీసీ బస్సులను ఈవీలుగా మార్చాలని సీఎం సూచించారు. త్వరలోనే వెయ్యి ఈవీ బస్సుల్ని కొనుగోలు చేయాలన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలన్నారు. గత పాలకులు విద్యుత్ వ్యవస్థను అస్తవ్యస్తంగా మార్చేశారని ముఖ్యమంత్రి సమీక్షలో ప్రస్తావించారు. పీపీఏల రద్దు నిర్ణయంతో రూ.9 వేల కోట్ల మేర భారం ప్రజలపై పడిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీఎస్ కె.విజయానంద్, ట్రాన్స్ కో, జెన్కో, డిస్కమ్ సీఎండీలు హాజరయ్యారు.

# వైకుంఠ దర్శనానికి 24 లక్షల మంది దరఖాస్తులు

**తిరుమల :** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాసుడు కొలువైన తిరుమలలో డిసెంబర్ 30వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకూ వైకుంఠ ద్వార దర్శనాలు కల్పిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ద్వార దర్శనాలకు సంబంధించిన టోకెన్లను ఈ డిప్ ద్వారా కేటాయిస్తున్నారు. మొదటి మూడు రోజుల టోకెన్లను ఈ డిప్ విధానంలో కేటాయిస్తారు. ఈ డిప్ రిజిస్ట్రేషన్ కోసం భారీ స్పందన వచ్చింది. ఏకంగా 24 లక్షల మంది వైకుంఠ ద్వార దర్శనాలకు నమోదు చేసుకున్నారు. తిరుమల వైకుంఠ ద్వార దర్శనాల కోసం భారీగా డిమాండ్ వచ్చింది. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని డిసెంబర్ 30వ తేదీ నుంచి పది రోజుల పాటు తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలను కల్పిస్తున్న సంగతి తెలిసిందే. అయితే భక్తుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని మొదటి మూడు రోజులకు సంబంధించిన వైకుంఠ ద్వార దర్శనం టోకెన్లను తిరుమల తిరుపతి దేవస్థానం ఈ డిప్ ద్వారా కేటాయించనుంది. ఇందుకోసం రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించగా.. ఈ-డిప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ గడువు సోమవారం సాయంత్రంతో ముగిసింది. డిసెంబర్ 30,31, జనవరి ఒకటో తేదీకి సంబంధించి మొత్తం లక్షా 80 వేల వైకుంఠ ద్వార దర్శనం టోకెన్లు అందుబాటులో ఉన్నాయి. అయితే1.80 లక్షల టోకెన్ల కోసం ఏకంగా 24 లక్షల మందికిపైగా భక్తులు ఈ-డిప్ ద్వారా తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ విషయాన్ని టీటీడీ ప్రకటించింది. డిసెంబర్ 30 వైకుంఠ ఏకాదశి పర్వదినం కావటం.. ఆ మరుసటి రోజైన డిసెంబర్ 31 ద్వాదశి, జనవరి 1 నూతన సంవత్సరం కావటంతో భక్తులు భారీగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ మూడు రోజులకు గానూ 9.6 లక్షల రిజిస్ట్రేషన్ల ద్వారా 24,05,237 మంది భక్తులు వైకుంఠ ద్వార దర్శనాల కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు టీటీడీ తెలిపింది. ఈ డిప్ లాటరీని డిసెంబరు 2న తీయనున్నారు. ఇందులో ఎంపికైన భక్తులకు టీటీడీ టోకెన్లు కేటాయించనుంది.మొదటి మూడు



రోజుల తర్వాత మిగిలిన ఏడు రోజులు శ్రీవారి భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. అలాగే 300 రూపాయల దర్శనం టోకెన్లు రోజుకు 15 వేల చొప్పున జారీ చేయనున్నారు. శ్రీవాణి టికెట్లను కూడా రోజుకు వేయి చొప్పున కేటాయిస్తారు. డిసెంబర్ ఐదో తేదీన వీటిని ప్రత్యేకంగా టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అలాగే తిరుపతి స్థానికులకు కూడా శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనాల అవకాశం కల్పిస్తున్నారు. జనవరి 6, 7,8వ తేదీలలో ఆఖరి మూడు రోజులు రోజుకు 5వేల టోకెన్లు చొప్పున స్థానికులకు కేటాయిస్తారు. ఈ టికెట్లను డిసెంబర్ 10న విడుదల చేస్తారు. వైకుంఠ ద్వారా దర్శనాల నేపథ్యంలో ప్రోటాకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.మరోవైపు తిరుమల తరహాలోనే టీటీడీ పరిధిలోని ఇతర ఆలయాలలోనూ భక్తులకు నిత్యాన్నదానం అమలు చేయనున్నారు. భక్తులకు అన్నప్రసాదాలను రుచిగా, శుచిగా, నాణ్యంగా అందించాలని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం అధికారులతో సమీక్షించిన టీటీడీ ఈవో.. పలు అంశాలపై చర్చించారు. టీటీడీ ఆలయాలలో అన్నప్రసాదాల పంపిణీ నేపథ్యంలో.. అన్నప్రసాదాల తయారు చేసే పోటు సిబ్బందికి శిక్షణ ఇప్పించాలని అధికారులకు సూచించారు. టీటీడీ ఆలయాలలో ఇప్పటి వరకు పంపిణీ చేస్తున్న అన్నప్రసాదాల వివరాలతో రోజువారీ నివేదిక రూపొందించాలన్నారు. టీటీడీలోఅన్య మతస్తులు ఉంటే వారిని గుర్తించాలని.. ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై నివేదిక తయారు చేయాలని టీటీడీ ఈవో అధికారులను ఆదేశించారు.

## ఎస్సీ - ఎస్టీలకు ప్రత్యేక నిధులు ఇవ్వాలి

-మొదటిపేజీ తరువాయి

భాగంగా 62 మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మొత్తంగా తిరుపతి జిల్లాలో రూ.5.89 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని మంత్రి వివరించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రయోజనాల విషయానికొస్తే, తిరుపతి జిల్లాలో జాతీయ పశు సంపద అభివృద్ధి మిషన్ కింద 36 మంది ఎస్సీలు, 29 మంది ఎస్టీలు నేరుగా లబ్ధి పొందినట్లు మంత్రి తెలిపారు. అదనంగా 1,094 మంది ఎస్సీ రైతులు, 118 మంది ఎస్టీ రైతులు పరోక్షంగా ఈ పథకం కింద ప్రయోజనం పొందినట్లు వివరించారు. ఈ పథకంలో ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ కోటా లేకపోయినా, రాష్ట్రాలు తమ షెడ్యూల్డ్ కుల, గిరిజన సబ్ ప్లాన్ నిధులను వినియోగించి ఈ వర్గాలకు మరిన్ని ప్రయోజనాలు అందించవచ్చని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ఈ సమాధానం పై ఎంపీ గురుమూర్తి స్పందిస్తూ ఈ పథకాన్ని మళ్ళీ పునరుద్ధరిస్తూ, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి సబ్ ప్లాన్ నిధుల నుండి కాకుండా ఈ పథకంలోనే ప్రత్యేకంగా నిర్దిష్ట నిధులు కేటాయించే విధానాన్ని ప్రవేశపెడితే అనేక మంది పాడి రైతులకు ప్రత్యక్ష లాభం చేకూరుతుందని ఎంపీ గురుమూర్తి కేంద్ర మంత్రికి లేఖ రాశారు. ఎస్సీ, ఎస్టీ రైతులు పశు సంపద రంగంలో ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రం ప్రత్యేక జోక్యం చేసుకోవాలని ఆ లేఖలో కోరారు. పథకం అమలు నిలిచిపోవడం వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎంపీ లేఖలో వివరించారు. ముఖ్యంగా పశు పోషణపై ఆధారపడిన ఎస్సీ, ఎస్టీ, సన్నకారు రైతులు, మహిళలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకం నిలిచిపోవడంతో రైతులు తమ పశువులకు బీమా చేసుకోలేకున్నారని, తత్ఫలితంగా ప్రకృతి వైపరీత్యాలు, వ్యాధుల వలన చనిపోయిన పశువుల స్థానంలో, కొత్తవి కొనుగోలు చేయలేక రైతులు నష్టపోతున్నారని ఎంపీ గురుమూర్తి పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో పథకం అమలును వేగవంతం చేసి, రైతులకు సత్వర ప్రయోజనాలు అందేలా చూడాలని ఎంపీ కోరారు.

## అమరావతిలో ఏడు గ్రామాల్లో రెండో విడత భూసమీకరణకు ఆదేశాలు

-మొదటిపేజీ తరువాయి

జారీ చేసింది. ఏడు గ్రామాల్లో 16,666.57 ఎకరాల పట్టా, ఎసైన్డ్ భూమి సమీకరణ బాధ్యతను సీఆర్డీఏ కమిషనర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని వైకుంఠపురంలో 1,965 ఎకరాలు, పెద్దమద్దూరులో 1,018 ఎకరాల పట్టా, యండ్రాయి గ్రామ పరిధిలో 1,879 ఎకరాల పట్టా, 46 ఎకరాల అసైన్డ్ భూమి.. కర్లపూడి లేమల్లెలో 2,603 ఎకరాల పట్టా భూమి, 51 ఎకరాల అసైన్డ్ భూమిని సమీకరించనున్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని హరిశ్చంద్రపురంలో 1,448.09 ఎకరాల పట్టా, 2.29 ఎకరాల అసైన్డ్, పెదపరిమిలో 5,886.18 ఎకరాల పట్టా మరో గ్రామం కలిపి మొత్తం 7 గ్రామాల్లో 16,562.52 ఎకరాల పట్టా భూములు, 104.01 ఎకరాల అసైన్డ్‌భూముల్ని సమీకరించాలని సీఆర్డీఏ కమిషనర్‌ను ఆదేశించింది. ఈ భూసమీకరణలో 3,828.30 ఎకరాల ప్రభుత్వ భూమి కూడా ఉంది.

## పార్టీ బలోపేతమే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

కార్యకర్తలకు పార్టీ అందిస్తున్న బీమా, సాధికారత, సోషల్ మీడియా, టెక్నాలజీ, 'మై టీడీపీ' యాప్ వినియోగం వంటి అంశాలపై ఎమ్మెల్యేలు కూన రవికుమార్, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మాధవి రెడ్డి, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ తదితరులు అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెషన్‌లో వైసీపీ చేసే తప్పుడు ప్రచారాలను ఎలా తిప్పికొట్టాలనే అంశంపై టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి తిరునగరి జోత్స్న మండల స్థాయి నాయకులకు వివరించారు. ఈ శిక్షణా తరగతుల్లో మంత్రులు, మాజీ మంత్రులు, పొలిట్‌బ్యూరో సభ్యులు, పలువురు సీనియర్ నేతలు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు మాట్లాడుతూ.. క్యాడర్ నుంచి నాయకులుగా ఎదిగేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, వారి విశ్వసనీయతను పొందాలని సూచించారు. కార్యకర్తలు, నాయకులు మరింత ఉత్సాహంతో పనిచేసి, పార్టీ సుదీర్ఘకాలం అధికారంలో ఉండేలా చూడటమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.

## స్నేహపూర్వక పెట్టుబడులకు ఏపీ సరైన గమ్యస్థానం



-మొదటిపేజీ తరువాయి

ప్రోత్సాహకాలు, రాయితీలపై ఇన్వెస్టర్లకు స్పష్టత. ప్రపంచ పెట్టుబడిదారులతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని, పెట్టుబడులకు ఆహ్వానం పలికిన మంత్రి దుర్గేష్. రాష్ట్రంలో సాహస, ఆధ్యాత్మిక, తీరప్రాంత , ఫిల్మ్ టూరిజం సర్క్యూట్‌లను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. తీర ప్రాంతాల నుండి సినీ కారిడార్ల వరకు సంబంధించిన అన్ని రంగాలలో భారతదేశ పర్యాటక, సృజనాత్మక ఆర్థికవ్యవస్థలో కొత్త మార్గాన్ని నిర్దేశించిన ఈ సమ్మిట్ లో ప్రపంచ పెట్టుబడిదారులతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని, పెట్టుబడిదారులకు స్నేహపూర్వక గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా చలనచిత్ర నిర్మాణం, పర్యాటక రంగాలలో ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పెట్టుబడి అవకాశాలను, కల్పించే ప్రోత్సాహకాలు, రాయితీలపై ఇన్వెస్టర్లకు స్పష్టతనిచ్చారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను2.4 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చే స్వర్ణాంధ్ర విజన్ ః2047 ను పంచుకున్నారు. ఈ ప్రణాళికలో కీలకమైన సజనాత్మక ఆర్థిక వ్యవస్థ,డీప్ టెక్నాలజీల పాత్రను వివరించారు. ఏపీ టూరిజం కొత్త పాలసీ 2024%-%29 ద్వారా ఇన్వెస్టర్లకు అందించే ప్రోత్సాహకాలు, రాయితీలు ప్రత్యేకంగా అక్కడికి వచ్చిన ఇన్వెస్టర్లతో భేటీ అయి వివరించారు. రాష్ట్రంలో సాహస, ఆధ్యాత్మిక, తీరప్రాంత , ఫిల్మ్ టూరిజం సర్క్యూట్‌లను అభివద్ధి చేయడానికి విశాఖపట్నం, తిరుపతి, గండికోట, రాజమండ్రి, అమరావతి, శ్రీశైలం, అరకు లోయలను యాంకర్ హబ్‌లుగా గుర్తించి అభివద్ధి చేస్తున్నామని, ఆయా ప్రాంతాల ప్రత్యేకతలను వివరించారు.యానిమేషన్, గేమింగ్, వీఎఫ్ఎక్స్ రంగాలలో గ్లోబల్ లీడర్‌గా ఎదగడానికి, ఏఐ, ఎక్స్ ఆర్ టెక్నాలజీలు మరియు క్లౌడ్ మౌలిక సదుపాయాలలో పెట్టుబడి పెట్టి ఆంధ్రప్రదేశ్‌ను సజనాత్మక పరిశ్రమల కోసం 'ఆంధ్ర వ్యాలీ'గా మారుస్తామని ప్రకటించారు. అదే విధంగా సినిమా షూటింగ్‌ల కోసం అనుమతులను సులభతరం చేసే లక్ష్యంతో కొత్త 'సమగ్ర కొత్త ఫిల్మ్ టూరిజం పాలసీ' ని త్వరలో తీసుకురానున్నామని, ఈ క్రమంలో సినిమా రంగ అభివద్ధికి పెట్టుబడులు పెట్టి సహకరించాలని కోరారు. రెండో రోజు సమ్మిట్ లో భాగంగా కూ, బుక్ మై షో ప్రతినిధులు అనిల్ మఖిజా, చిరాగ్ సరైయా, 91 ఫిల్మ్ స్టూడియోస్ వ్యవస్థాపకులు నవీన్ చంద్ర, గగన్ విహార్ స్పేస్ సిటీ మరియు స్పేస్ ఎగ్జిబిషన్ ఫౌండర్ శ్రీకాంత్ కోడెబోయిన, యూఎస్ఏ కు చెందిన బ్లూ ఐ సాఫ్ట్ కార్ప్ మరియు బీఈఎస్ స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులతో, డెల్లా రిసార్ట్స్, డెల్లా అడ్వెంచర్ పార్క్ (ఎంఓయూ భాగస్వామి) ఫౌండర్ జిమ్మి మిస్త్రీ, ఐలైన్ స్టూడియోస్ డైరెక్టర్ డి. రాకేష్ లతో మంత్రి కందుల దుర్గేష్, ఎండీ ఆమ్రపాలి కాట ప్రత్యేకంగా భేటీ అయి చర్చించారు. అదే విధంగా సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రవి కొట్టార్కర్ సినిమా రంగానికి సంబంధించిన పలు ప్రతిపాదనలు మంత్రి దుర్గేష్ దష్టికి తీసుకువచ్చారు. ఇరువురూ సుదీర్ఘంగా సినిమా రంగం అభివద్ధిపై చర్చించారు.అనంతరం త్వరలోనే విజయవాడ వచ్చి కలుస్తామని తెలుపగా మంత్రి దుర్గేష్ ఆయనను ఆహ్వానించారు. రెండు రోజుల సమ్మిట్ లో పలువురు ప్రతినిధులు ఏపీలో స్టూడియోల నిర్మాణం చేపట్టాలని ఆసక్తి చూపారని, ప్రత్యేకించి వైజాగ్ లో డిజిటల్ స్టూడియో ల ఏర్పాటుకు యోచిస్తున్నట్లు తెలిపారని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్ సినిమా రంగ ఇండస్ట్రీ అభివద్ధి చెందుతుందని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు








- స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఎమ్మెల్యే పరిటాల సునీత
- రాప్తాడులో మన డబ్బులు-మన లెక్కలు కార్యక్రమం
- 636 సంఘాలలోని 3820 మందికి రూ.32.48కోట్ల రుణాలు అందజేత

**అంకుశం న్యూస్ అనంతపురం డిసెంబర్ 2:** మహిళలు అన్ని రంగాల్లో నేడు రాణిస్తున్నారని పురుషులకు దీటుగా పనిచేస్తున్నారనిఆటోల దగ్గర నుంచి విమానాలు నడిపే వరకు మహిళలు ధైర్యంగా ముందుకు అడుగులు వేస్తున్నారని ఇలాంటి సమయంలో మనం మోసపోకూడదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో డిఆర్డిఏ ఆధ్వర్యంలో మన డబ్బులు - మన లెక్కలు సమావేశాన్ని నిర్వహించారు. అలాగే స్వయం సహాయక సంఘాలకు వివిధ పథకాల కింద వచ్చిన రుణాలకు సంబంధించి మెగా చెక్కును అందజేశారు. రాప్తాడు మండల వ్యాప్తంగా ఉన్న స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, డీఆర్డీఏ అధికారులు, టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి జండర్ రిసోర్స్ సెంటర్ ని ప్రారంభించారు. మండలంలో ఉన్న 639 సంఘాలకు గాను 3858 సభ్యులకు 32కోట్ల 47లక్షల 50వేల రూపాయలకు సంబంధించిన చెక్కులను అందజేశారు. మన డబ్బులు మన లెక్కలు కార్యక్రమంలో భాగంగా జెండర్ కౌన్సిలింగ్ సెంటర్, మైక్రో ఎంటర్ప్రెనూర్ డెవలప్మెంట్, ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్ వంటి అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఇంతమంది మహిళలు ఇలా బయటకు వచ్చి ఇంత పెద్ద కార్యక్రమంలో పాల్గొంటున్నారంటే దానికి మొదట బీజం వేసింది ఆనాడు ఎన్టీఆర్, ఆ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రమేనన్నారు. ఒకప్పుడు మహిళా సంఘాలను చూసి చాలామంది నవ్వుకున్నారని... ఎగతాళి కూడా చేశారన్నారు. కానీ ఈరోజు వారే కుటుంబానికి ప్రధాన ఆధారంగా మారుతున్నారన్నారు. ఇంటి పట్టాల దగ్గర నుంచి ప్రభుత్వం నుంచి ఏ లబ్ధి జరిగినా... అది మహిళల పేరు మీదనే ఉంటుందన్నారు. దీనికి ప్రధానమైన కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు మొదటి రోజుతో పోల్చుకుంటే ఈరోజు వరకు ఎంతో ప్రగతి సాధించారన్నారు. అయితే వారికి ఇంత పరిజ్ఞానం ఉన్నా... చాలామంది ఇంకా మోసపోతూనే ఉన్నారన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు వచ్చిన రుణాలను క్రమం తప్పకుండా చెల్లిస్తుంటే కొందరు తమ స్వార్థానికి వాడుకుని మోసం చేస్తున్నారన్నారు. చెన్నేకొత్తపల్లి మండలంలో 36 లక్షలు, ఆకుతోటపల్లిలో 32 లక్షల రూపాయలు బ్యాంకులకు చెల్లించకుండా మోసం చేశారన్నారు. వీటిపై కేసులు పెట్టి విచారణ చేస్తే పురుగుల మందు తాగి చస్తామంటూ బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను మోసం చేసేవారు ఎవరు బాగుపడరని ఎమ్మెల్యే సునీత ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి వాటికి చెక్ పెట్టాలన్న ఉద్దేశంతోనే మన డబ్బులు మన లెక్కలు కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ యాప్ ద్వారా ఎవరు మోసపోకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకున్నారన్నారు. దీనిపై స్వయం సహాయక సంఘాలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సభ్యులు ఎవరు మోసపోకుండా చూడాల్సిన బాధ్యత యానిమేటర్లు, గ్రూపు లీడర్ల మీద ఉందన్నారు. ప్రస్తుతం బ్యాంకులు అందిస్తున్న రుణాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా తీసుకున్న రుణాలు చెల్లించాలని సూచించారు. ఒకప్పుడు వేలల్లో తీసుకునే రుణాలు ఇప్పుడు కోట్ల రూపాయలకు చేరాయని... ఈ ఘనత మీకు మాత్రమే దక్కుతుందన్నారు. ఇంట్లో కుటుంబ సభ్యుల సహకారం లేకుండా మనం ఏది సాధించలేమన్నారు. మహిళలు మహారాణులు కావచ్చు కానీ.. భర్తల సహకారం కచ్చితంగా ఉండాలన్నారు. వారి సహకారం ఉంటేనే మనం ఏ రంగంలో అయినా ముందుకు వెళ్తామని ఎమ్మెల్యే సునీత అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికే మహిళల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటివి మహిళల కోసమే తీసుకొచ్చిందని ఎమ్మెల్యే సునీత గుర్తు చేశారు. మీకు జరుగుతున్న జరుగుతున్న మంచిని 10 మందికి చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమం అనంతరం రాప్తాడులో నూతనంగా నిర్మిస్తున్న అన్న క్యాంటీన్ ను ఎమ్మెల్యే సునీత పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుని అక్కడున్న కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. దాదాపుగా క్యాంటీన్ నిర్మాణం పూర్తయిందని ఇక ప్రారంభోత్సవం త్వరలో ఉంటుందని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు..

# రామచంద్రపురంలో ప్రజా దర్బార్ నిర్వహించిన మంత్రి వాసంశెట్టి సుభాష్

- ప్రజా సమస్యల పరిష్కారానికే కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత
- ప్రజా సమస్యలు పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి





**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ డిసెంబర్02:** ప్రజా సమస్యలు పరిష్కారం లక్ష్యంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. మంగళ వారం రామచంద్రపురం మంత్రి క్యాంపు కార్యాలయంలో కూటమి పార్టీ నాయకులు వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజాదర్బార్ లో పలు గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొని మంత్రి సుభాష్ కు అర్జీలు సమర్పించారు. స్వీకరించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలోని సమస్యలన్నీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అలాగే అధికారులు దృష్టికి వచ్చిన ఏ సమస్య అయినా త్వరగా తిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రామచంద్రపురం లో ఏ సమస్యఅయిన నా దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నామని ఎలాంటి సమస్యలను నా దృష్టి తీసుకురావాలని కార్యకర్తలకు ప్రజలకు సూచించారు. నన్ను గెలిపించిన ప్రతి కార్యకర్తకు ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, రామచంద్రపురం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవల్లి శివ, కంచుమర్తి బాబురావు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్తాని మర్యాదపూర్వకంగా కలిసి పలు వినతులు అందజేసిన ఎమ్మెల్యే బత్తుల

- పోలీస్ భవనాల నిర్మాణానికి నిధులు ఇవ్వండి
- రాజానగరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేసిండి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ డిసెంబర్ 02:** రాజనగరం అసెంబ్లీ నియోజకవర్గంలోని సీతానగరం,కోరుకొండ పోలీస్ స్టేషన్లు, కోరుకొండ సర్కిల్ కార్యాలయాలకు భవనాలు నిర్మించాలి. DSP నార్త్ జోన్ కార్యాలయాలకు కోరుకొండలో కొత్త భవనాలు నిర్మించాలి. కోరుకొండ సర్కిల్ కింద ఉన్న సీతానగరం, కోరుకొండ పోలీస్ స్టేషన్లకు సొంత భవనాలు లేక ప్రైవేటు భవనాల్లో ఉన్నాయి. కోరుకొండ పోలీస్ స్టేషన్ రైతు సేవా కేంద్రంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు. DSP నార్త్ జోన్ కార్యాలయం సొంత భవనం లేకపోవడం వలన ప్రైవేటు ప్రాంగణంలో పనిచేస్తుంది. ఈ భవనాల నిర్మాణాలకు తగిన విధంగా భూమి సేకరించి భవనాలు నిర్మించాలని ఆయన కోరారు. అంతేకాకుండా పోలీసులకు వాహనాలు సమకూర్చాలని, రాజనగరం నియోజకవర్గంలోని రాజనగరం, కోరుకొండ సర్కిల్లను కలిగి ఉన్న మూడు పోలీస్ స్టేషన్లకు కొత్త వాహనాలను మంజూరు చేయాలనీ కోరారు. ఈ స్టేషన్లకు కేటాయించిన ప్రస్తుత వాహనాలు తరచూ రిపేర్ లతో మూలన పడిఉన్నాయి. కాబట్టి వెంటనే వాహనాలను మంజూరు చేయాలనీ కోరారు. ఇద్దరు సర్కిల్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ల (CIలు) కోసం రెండు కొత్త వాహనాలు మరియు మూడు పోలీస్ స్టేషన్ల సబ్ ఇన్స్పెక్టర్ల (SIలు) కోసం మూడు కొత్త వాహనాలను మంజూరు చేయాలని కోరారు. పై విషయలపై సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ హరీష్ కుమార్ గుప్తా త్వరితగతిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

# ధర్మవరంలో అటల్ బిహారీ వాజ్పేయి విగ్రహ స్థాపనకు భూమి పూజ

- మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలపై ధర్మవరంలో వాజ్పేయి విగ్రహ భూమి పూజ



**అంకుశం న్యూస్ ధర్మవరం, డిసెంబర్ 02:** భారత దేశ మాజీ ప్రధాన మంత్రి, భారత రత్న అటల్ బిహారీ వాజ్పేయి గారి స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని స్మరించుకుంటూ, ఆయన విగ్రహ స్థాపనకు ధర్మవరంలో భూమి పూజ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ గారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టబడింది. ఈ సందర్భంగా బీజేపీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు జి.ఎం. శేఖర్, మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు లు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్మవరం ప్రజలు గౌరవంగా స్మరించుకునేలా, ఈ నెల 11వ తేదీన కాలేజీ సర్కిల్ వద్ద అటల్ బిహారీ వాజ్పేయి గారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు వారు తెలిపారు. అటల్ బిహారీ వాజ్పేయి గారు దేశ అభివృద్ధికి, ప్రజాస్వామ్యం బలపరచడానికి చూపిన అసాధారణ సేవలను గుర్తు చేసుకోవడంలో భాగంగా ఈ విగ్రహ స్థాపన చేపడుతున్నామని బీజేపీ నేతలు పేర్కొన్నారు. ధర్మవరం పట్టణ అభివృద్ధిలో భాగంగా, ప్రజలు ఆదర్శంగా చూసే నేతల స్మారక నిర్మాణాలకు ఎల్లప్పుడూ సాయపడుతున్నామని కూడా తెలిపారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం వేదిక ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే నల్లమిల్లి

- ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నేతలు





**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ డిసెంబర్ 02:** ప్రజా సమస్యల పరిష్కారం వేదిక ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించిన ఈ సందర్భంగా అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అనపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో “ప్రజా దర్బార్” నిర్వహించడం జరిగింది.ఉదయం 10 గంటలకు ప్రారంభించడం జరిగింది రెండు గంటల వ్యవధిలో దాదాపుగా 75 పిర్యాదులు ప్రజల నుండి స్వికరించడం జరిగింది. అనపర్తి GBR కాలేజ్ యాజమాన్యానికి, R&B, పంచాయతీ రాజ్ శాఖలకు సంబంధించిన భూమి ఆక్రమణ గురిమైందని అధికారులు నాలుగు నెలలుగా నోటీసులు ఇవ్వడం జరుగుతుంది. యాజమాన్యం అధికారులకు ఏదో ఒక సాకు చెబుతూ నాలుగు నెలలుగా వ్యవధి అడుగుతూ వచ్చారు,అధికారులు కూడా వ్యవధి ఇవ్వడం జరిగింది.ఇప్పుడు ఈ ప్రజా దర్బార్ లో పిర్యాదు అందింది ఈ విషయాన్ని ఆర్డివో దృష్టికి, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళడం జరుగుతుంది.

అదే విధంగా అనపర్తి గాంధీ బొమ్మ సెంటర్ నుండి ILTD వరకు ఉన్న రోడ్ అక్రమణకు గురైందని పిర్యాదు వచ్చింది దానిపైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. గత వైఎస్ఆర్సిపి గవర్నమెంట్ లో ఏ విధంగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని ఇవాల్టికి వాటిని ప్రభుత్వ పరం చేయడం కోసం ఎందుకు సందేహిస్తున్నారు అని కూడా సమాధానం చెప్పాల్సిన అవసరం మాజీ శాసనసభ్యులకు ఉందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. వారు ఒకటే చెప్తున్నారు విద్యారంగం,వైద్యరంగం ప్రైవేటీకరణ కాకూడదు అని ఈ మధ్యకాలంలో వారు ఊక దంపుడు ఉపన్యాసం ఇవ్వటం జరుగుతుంది.విద్యారంగం,ప్రైవేటీకరణ కాకూడదు అంటే ఎప్పుడో గోలుగూరి బాపిరాజు స్త్రీ విద్యను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ ప్రాంత రైతాంగం దగ్గర విరాళాలు వసూలు చేసి కాలేజీ నిర్మాణం చేస్తే మొన్న వైయస్సార్ ప్రభుత్వ హయాంలో దానిని ప్రైవేటీకరణ ఎందుకు చేశారు దానికి సమాధానం సూర్యనారాయణ రెడ్డి చెప్పాలి. వైద్యరంగం ప్రైవేట్ పరం కాకూడదని అన్నప్పుడు మీరు ప్రైవేట్ వైద్యుల లేక ప్రభుత్వ వైద్యుల.మీ కుమారుడు ప్రభుత్వ వైద్యుల,ప్రైవేటు వైద్యుడా మీరేమో ప్రైవేట్ రంగంలో వైద్యం చేసుకుంటూ కోట్ల కోట్లకు అర్జిస్తున్నారు మిగిలిన చోట్ల మాత్రం వైద్యరంగం,విద్యారంగం ప్రైవేటుపరం కాకూడదని నీతి వాక్యాలు చెబుతున్నారు ఈ రెండిటికీ వ్యత్యాసానికి సమాధానం తమరు చెప్పాల్సిందిగా ఈ సందర్భంగా కోరుకుంటూన్నాను. ఇవాళ ఏదైతే ఇక్కడికి వచ్చిన సమస్యలపై ఏదైతే ఫిర్యాదులు వచ్చినాయో వీటన్నిటిని దశలవారీగా వాటిని పరిష్కారం చేసి సంబంధిత ఫిర్యాదుదారునికి మరల సక్రమంగా వాటికి సమాచారం అందించడం జరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది అదేవిధంగా ముఖ్యమంత్రి కార్యాలయంతో కూడా అనుసంధానం చేయడానికి అధికారులు ఉన్నారు. ఇక్కడ అన్ని ఫిర్యాదులు ముఖ్యమంత్రి కార్యాలయానికి రిపోర్ట్ చేయడం జరుగుతుంది. అక్కడ పరిష్కారం చేయాల్సిన విషయాల్ని అక్కడ పరిష్కారం చేసి తొందరలోనే వీటన్నిటిని పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తామని తెలియజేసుకుంటున్నాను. అత్యద్భుతమైన స్పందన ఉంది తప్పనిసరిగా వచ్చిన అందరికీ వారి ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి లోకేష్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దానిని ముందుకు తీసుకెళ్తామని సందర్భంగా తెలియచేసిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి.ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గం కూటమి నాయకులు,నాలుగు మండలాల కూటమి నాయకులు,నాలుగు మండలాల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీవారి సేవకులు హిందూ ధర్మానికి బ్రాండ్ అంబాసిడర్లు

టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి





**అంకుశం ప్రతినిధి తిరుమల డిసెంబర్ 2:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శ్రీవారి సేవను మరింత బలోపేతం చేయడంలో భాగంగా వారిలోని నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే ‘ట్రెయిన్ ద ట్రైనీస్’ శిక్షణా కార్యక్రమం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి అన్నారు.మంగళవారం తిరుమలలోని సేవా సదన్-2లో గ్రూప్ సూపర్వైజర్ల (మాస్టర్ ట్రైనర్లు)లకు నిర్వహించిన తొలి బ్యాచ్ ‘ట్రెయిన్ ద ట్రైనీస్’ శిక్షణా కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారి సేవకులు హిందూ ధర్మానికి బ్రాండ్ అంబాసిడర్లు అని చెప్పారు. దేశవిదేశాల నుండి తిరుమలకు విచ్చేస్తున్న భక్తులకు సేవ చేయడంలో శ్రీవారి సేవకుల పాత్ర అత్యంత కీలకమైనది తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా తమ తమ ప్రాంతాల్లోని శ్రీవారి సేవకులకు గ్రూప్ సూపర్వైజర్లు శిక్షణ ఇచ్చేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్లానింగ్ డిపార్ట్మెంట్, ఐఐఎం-అహ్మదాబాద్ నిపుణులు శిక్షణ మాడ్యూల్‌లను రూపొందించినట్లు చెప్పారు. ఈ శిక్షణలో వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాల పెంపు, కమ్యూనికేషన్, భక్తులతో నడవడిక, నాయకత్వ లక్షణాలు, టీటీడీ చరిత్ర, శ్రీవారి సేవ ప్రాముఖ్యత, పురాణాల పరిజ్ఞానం తదితర అంశాలు ఉంటాయన్నారు. దీనికోసం ఆయా అంశాల్లో నిష్ణాతుల ద్వారా శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు.ఈ శిక్షణ పొందిన గ్రూప్ సూపర్వైజర్లు తమ ప్రాంతాల్లో శ్రీవారి సేవకు నమోదు చేసుకున్న శ్రీవారి సేవకులకు సేవకు రాకమునుపే శిక్షణ అందించి వారిని భక్తులకు ఉన్నతమైన సేవలు అందించే విధంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఆయన తెలిపారు. ఈ శిక్షణ తరగతుల సారాన్ని గ్రహించి, ఇతర సేవకులను కూడా సమర్థవంతంగా తీర్చిదిద్దిద్దాలని గ్రూప్ సూపర్వైజర్లలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పండితులు డా. మేడసాని మోహన్, డా. దామోదర్ నాయుడు, డా. శ్రీనివాస్, టీటీడీ ఛీఫ్ వీఆర్వో డాక్టర్ టి.రవి, పీఆర్వో (FAC) కుమారి నీలిమ, సేవా సదన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అనాధ ఆశ్రమం లో అన్నదానం



**అంకుశం న్యూస్ ధర్మవరం డిసెంబర్ 2:** ధర్మవరం మండలం గొట్లూరు అనాధ ఆశ్రమం లో పుట్టినరోజు సందర్భంగా చిన్నారుల జన్మదినం జరుపుకుంటున్న చుక్కలురు భవనీత్, మరియు చుక్కలూరు వర్షిత జన్మదిన సందర్భంగా వారి తాతగారు చుక్కలూరు నడిపినాగన్న కుటుంబ సభ్యులు గొట్లూరు అనాధ శరణాలయంలో అన్నదానం నిర్వహించడమైనది.ఈ కార్యక్రమం లో ఇంకా సుధాకర్ నాగమణి సుంకర నాగరత్న తదితరులు పాల్గొని సేవా కార్యక్రమం విజయవంతం చేశారు.

# నగరంలో శానిటేషన్ మరింత మెరుగుపడాలి

## – క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్, మెప్మా అధికారులతో సమావేశం


**అంకుశం న్యూస్ అనంతపురం డిసెంబర్ 2:** అనంతపురం నగరంలో గతంలో కన్నా పారిశుద్ధ్యం మెరుగుపడిందని.. నగరంలో ఎక్కడా సమస్య లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీపై ఉందని నూతన శానిటరీ సూపర్వైజర్లకు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు మున్సిపల్, మెప్మా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, సీపీఓ అశోక్ కుమార్, మెప్మా పిడి విశ్వజ్యోతి, ఎంహెచ్ఓ నరసింహులు, నూతన శానిటరీ సూపర్వైజర్లు, అధికారులు పాల్గొన్నారు. ముందుగా నగరంలో పారిశుద్ధ్యంపై అక్కడక్కడ వస్తున్న ఫిర్యాదుల మీద



ఎమ్మెల్యే ఆరా తీశారు. గత ప్రభుత్వంలో లాగా నిర్లక్ష్యంగా ఉంటే కుదరదని కచ్చితంగా సిబ్బంది తోపాటు అధికారులు కూడా క్షేత్రస్థాయిలో ఉండాలని సూచించారు. నూతన సూపర్వైజర్లు దీనిని బాధ్యతగా తీసుకొని పనిచేయాలని ఆదేశించారు. ప్రతినిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వాస్తవ పరిస్థితి ఏంటన్నది తెలుసుకోవాలన్నారు. ప్రజల నుంచి ఎక్కడా ఫిర్యాదులు రాకూడదని ఎమ్మెల్యే అన్నారు. మరోవైపు మెప్మా అధికారులు తృప్తి క్యాంటీన్లు, స్మార్ట్ స్ట్రీట్ మార్కెట్ల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. ఇందుకోసం లబ్ధిదారులను ఎంపిక చేయాలని.. అలాగే స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం మహిళా సాధికారత ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# డిసెంబర్ -14 వరకు పీఎం ఆవాస్ యోజన జియో ట్యాగింగ్ కు అవకాశం ఉంది





- ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ సూచన
- పార్టీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన శ్రీరామ్
- 7మందికి రూ. 4.77 లక్షల రూపాయల సాయం

**అంకుశం న్యూస్ ధర్మవరం డిసెంబర్ 2:** ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై 2.0) పథకం కింద జియో టాకింగ్ చేయని వారికి డిసెంబర్ 14 వరకు అవకాశం ఉందని.. దీనిని సద్వినియోగం చేసుకోవాలని ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ సూచించారు. ఇదే అంశానికి సంబంధించి ధర్మవరం పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పీఎం ఆవాస్ యోజన కింద గృహ నిర్మాణానికి దరఖాస్తు చేసినవారికి, ఇంకా దరఖాస్తు చేయని అర్హులైన లబ్ధిదారులకు డిసెంబర్ 14 వరకు గడువు పొడిగించినట్లు శ్రీరామ్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు తమ పరిధిలోని సచివాలయాల్లో గృహ నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. హౌసింగ్ ఇంజినీరింగ్ సిబ్బంది ద్వారా తమ స్థలాల్లో జియో ట్యాగింగ్ చేయించుకోవడం తప్పనిసరి అన్నది ప్రజలకు అవగాహన కల్పించాలని నాయకులకు సూచించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఇళ్లకు జియో ట్యాగింగ్ అన్నది తప్పనిసరిగా అవసరమని... జియో ట్యాగింగ్ చేయించుకోకపోతే లబ్ధిదారులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వీటిపై నాయకులు, కార్యకర్తలు నేటి నుంచే ప్రజాక్షేత్రంలోకి వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. దరఖాస్తుకు ఎలాంటి పత్రాలు అవసరం అలాగే జియో ట్యాగింగ్ కు ఏమి ఉండాలన్నది వారికి తెలియజేయాలన్నారు. సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకొని ప్రజలకు అవగాహన కల్పించి ఎవరు నష్టపోకుండా చూడాలని శ్రీరామ్ సూచించారు. 14వ తేదీ వరకు నాయకులు, కార్యకర్తలు ప్రజాక్షేత్రంలో ఉండి ఈ పథకం పై దృష్టి సారించాలని ఆదేశించారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన పరిటాల శ్రీరామ్**

ధర్మవరం నియోజకవర్గ పరిధిలో ఎన్టీఆర్ వైద్య సేవలు అందక ప్రైవేట్ ఆస్పత్రిల్లో చికిత్సలు పొందిన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పరిటాల శ్రీరామ్ అందజేశారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన 7మందికి రూ. 4.77 లక్షల రూపాయల విలువైన చెక్కులను పార్టీ కార్యాలయంలో అందజేశారు. లబ్ధిదారులు పరిటాల శ్రీరామ్, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవలు కొన్ని సందర్భాల్లో అందక చాలామంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి వారిని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ఉదారంగా సీఎంఆర్ఎఫ్ కింద సాయం అందిస్తున్నారన్నారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా గతంలో ఎప్పుడు లేని విధంగా చాలామందికి ఈ సాయం అందిందని శ్రీరామ్ తెలిపారు. పార్టీలకు అతీతంగా ఈ సాయం చేస్తున్నట్లు చెప్పారు....

## కాలం చెల్లిన వస్తువులను బహిరంగ వేలం

– విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,





**అంకుశం ప్రతినిధి విశాఖపట్నం డిసెంబర్ 2:** విజయనగరం జిల్లా పోలీసుశాఖ వినియోగించి, కాలం చెల్లిన వస్తువులను ఈ నెల 9న వేలం వేయనున్నట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ గారు డిసెంబర్ 2న ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీసుశాఖ వినియోగించి, కాలం చెల్లిన జనరేటర్లు, బ్యాటరీలు, ఎలక్ట్రికల్ వస్తువులు (ఫ్యాన్స్, టేబుల్ ఫ్యాన్స్ వగైరా), ఎలక్ట్రానిక్ వస్తువులు (రిఫ్రిజిరేటర్లు, వాటర్ డిస్పెంసర్లు, డీప్ ఫ్రీజర్లు, ఏసిలు వగైరా), ఫర్నిచర్ వస్తువులు, ఐరన్ స్క్రాప్ మరియు మిగతా వస్తువులు 8 లాట్లుగా విభజించామన్నారు. ఈ వస్తువులను బహిరంగ వేలం నిర్వహించనున్నామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. వేలం వేయనున్న వస్తువులను ప్రస్తుతం జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో భద్రపర్చామని, ఆసక్తి కలిగిన వేలందార్లు డిసెంబరు 3 నుండి 8 వరకు ఉదయం 10 నుండి సాయంత్రం 5 గం.ల వరకు పరిశీలించుకోవచ్చున న్నారు. వివరాల కొరకు విజయనగరం ఎఆర్ అడ్మిన్ ఆర్ఐ ఎన్.గోపాల నాయుడు ఫోను నంబరు 9121109485 ను సంప్రదించవచ్చునని జిల్లా ఎస్పీ తెలిపారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన బిడ్డర్లు డిసెంబరు 9న ఉదయం 10గంటలకు జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణం వద్ద నిర్వహించే వేలంలో పాల్గొనాలన్నారు. ఆసక్తి కలిగిన బిడ్డర్లు అదే రోజున బిడ్ అమౌంట్ ను జి.ఎస్.టితో సహా ఆన్లైన్లో చెల్లించి, వస్తువులను 24గంటలలో తీసుకొని వెళ్లాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఒక ప్రకనటలో తెలిపారు.

## కానిస్టేబుల్ కుటుంబానికి సహచర బ్యాచిమేట్ల ఆర్థిక చేయూత

జిల్లా ఎస్పీ జగదీష్ చేతుల మీదుగా రూ. 4,31,200/- నగదు అందజేత









**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం డిసెంబర్ 2:** జిల్లాలో ఇటీవల మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి సహచర బ్యాచిమేట్ల ఆర్థిక చేయూతనందించారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ చేతుల మీదుగా ఈరోజు మృతుడి కుటుంబానికి రూ. 4,31,200/- నగదు అందజేశారు. వివరాలు... అనంతపురం ట్రాఫిక్ పోలీసు స్టేషన్లో పని చేస్తున్న సతీష్ కుమార్ ఇటీవలే చనిపోయారు. 2011 బ్యాచ్ నకు చెందిన బ్యాచిమేట్లు ఆర్థిక సాయం అందించాలనే ఉద్దేశ్యంతో రూ. 4,31,200/- నగదు పోగుచేశారు. ఈ మొత్తాన్ని జిల్లా ఎస్పీ చేతులు మీదుగా మృతుడి భార్య మంజు గారికి ఎస్పీ అందజేశారు. 2011 బ్యాచ్ కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ జగదీష్అభినందించారు. ఈకార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్ , గాండ్ల హరినాథ్, ఆనంద్ లు మరియు 2011 బ్యాచిమేట్లు పలువులు పాల్గొన్నారు.

## ఆరోగ్యాన్ని...మానసికోల్లాన్ని అందించేది క్రీడలే









**అంకుశం ప్రతినిధి విశాఖపట్టణం, డిసెంబర్ 2:** ఆరోగ్యాన్ని మానసికోల్లసాన్ని అందించేది క్రీడలే అన్న రీతిలో నేడు విద్యాసంస్థలు చదువులతో పాటు క్రీడలకూ ప్రాధాన్యతనిస్తున్నాయి. ఈ క్రీడా పోటీల్లో సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు మనుమరాళ్ళు...మనుమడు బహుమతులు సాధించారు. విశాఖ గాజువాక ' ఓక్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ ' లో గత రెండు రోజుల పాటు జరిగిన క్రీడా దినోత్సవాలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో వేదుల రాఘవ ...శ్రీమతి లలితా జ్యోతి దంపతుల కుమార్తె కృత్తిక (7 వ తరగతి) ఖో ఖో లో ద్వితీయ స్థానం లో సిల్వర్ మెడల్, సర్టిఫికెట్...అలాగే కుమారుడు కార్తికేయ (3 వ తరగతి) రన్నింగ్ రేస్ లో ద్వితీయ స్థానం తో సర్టిఫికేట్, సిల్వర్ మెడల్ పొందారు...హైదరాబాద్ నిజాంపేట్ లోని స్ప్రింగ్ బోర్డ్ స్కూల్ లో జరిగిన క్రీడోత్సవాల్లో నిమ్మరాజు శ్రీవత్సవ కుమార్ - శ్రీమతి నాగజ్యోతి దంపతుల కుమార్తె జోష్నిక ప్లేస్కూల్ విభాగం రన్నింగ్ రేస్ నాలుగో స్థానం లో సర్టిఫికెట్ పొందింది.

## బైపాస్ రోడ్డు పనులను వేగంగా చేపట్టాలి

- : రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్





**అంకుశం న్యూస్అనంతపురం, డిసెంబర్ 02 :** ఉరవకొండ పట్టణ పరిధిలోని కనేకల్లు క్రాస్ నుంచి గుంతకల్లు రోడ్డు వరకు జరుగుతున్న బైపాస్ రోడ్డు పనులను రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఉరవకొండ పట్టణ పరిధిలో కనేకల్లు క్రాస్ నుంచి గుంతకల్లు రోడ్డు వరకు జరుగుతున్న బైపాస్ రోడ్డు పనులను వేగంగా త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కనేకల్లు క్రాస్ నుంచి గుంతకల్లు రోడ్డు వరకు 3 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు పనులను చేపడుతుండగా, ఇప్పటికే సగానికిపైగా పూర్తి కావడం జరిగిందని అధికారులు వివరించారు. ఇప్పటికే కనేకల్లు క్రాస్ నుంచి 900 మీటర్ల మెటల్ రోడ్డు పూర్తి కాగా, మరో 400 మీటర్ల మేర రోడ్డు ముందుకు వెళ్లేందుకు సర్వే చేపట్టాల్సి ఉందని తెలుపగా, సర్వే వెంటనే 1, 2 రోజుల్లో పూర్తి చేయాలని, రోడ్డు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్.అండ్.బి ఏఈ నాగభూషణం, సూపర్ వైజర్ సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులచే మాస్టర్ చెఫ్ కార్యక్రమం నిర్వహించిన స్ప్రింగ్ బోర్డ్ అకాడమీ స్కూల్

- చెఫ్ డ్రెస్ లో ఆకట్టుకున్న చిన్నారి బాలబాలికలు
- విద్యార్థిదశలోనే చదువుతో పాటు సృజనాత్మకను





వెలికి తీయాలి

**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ డిసెంబర్ 02:** విద్యార్థులకు చదువుతో పాటు సృజనాత్మక విషయాలు నేర్పిస్తున్న మండపేట స్ప్రింగ్ బోర్డ్ అకాడమీ స్కూల్ నిర్వాహకులు అభినందనీయులని వాసవీ ఇంటర్నేషనల్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రీజనల్ సెక్రటరీ కాళ్లకూరి శాంతి అన్నారు. మండపేట స్ప్రింగ్ బోర్డు అకాడమీ స్కూల్లో ప్రిన్సిపాల్ పీ.విజయ లక్ష్మి దేవి ఆధ్వర్యంలో నిర్వహించిన మాస్టర్ చెఫ్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మంట ఉపయోగించకుండా వంటలను తయారు చేసే పోటీని నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసిన వంటలను కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాంతి రుచి చూసి విద్యార్థులను అభినందించారు. అనంతరం విజేతలను ఎంపికచేసి వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ దేవి మాట్లాడుతూ తమ పాఠశాలలోని విద్యార్థులకు ప్రతి విషయంపై అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతోనే వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మాస్టర్ చెఫ్ వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో, చెఫ్ రాజేష్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ ఫామ్ పాండ్లు, డ్రిప్, ఉద్యాన పంటలను ప్రోత్సహించాలి

- పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్
- అధిక సాంద్రత పద్ధతి - ఆధునిక సాంకేతికతతో రైతు ఆదర్శంగా మారిన రాసింపల్లి...



**అంకుశం న్యూస్ పుట్ట పర్తి డిసెంబర్ 2:** మంగళవారం జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ కొత్తచెరువు, కొత్తపల్లి, బుక్కపట్నం మండలాలలో విస్తృత పర్యటన నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఫామ్ పాండ్లు, ఉద్యాన పంటలు, డ్రిప్ సదుపాయాలు తదితర కార్యక్రమాలను పరిశీలించి, అమలు పరిస్థితులను రైతులను, అధికారులను తెలుసుకున్నారు. కొత్తచెరువు మండలంలోని నారేపల్లిలో రైతు భాస్కర్ రెడ్డి, కొత్తపల్లి మండలం చిన్నరాయనపల్లిలో రైతు కృష్ణయ్యకు సంబంధించిన ఫామ్ పాండ్లు, ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం బుక్కపట్నం మండలం రాసింపల్లి గ్రామంలో రైతు అంచే శ్రీనివాసులు అభివృద్ధి చేసిన అధిక సాంద్రత మామిడి తోటను పరిశీలించారు.

ఈ రైతు పద్ధతులను ఆదర్శంగా తీసుకుని నారేపల్లి రైతు భాస్కర్ రెడ్డి కూడా నాలుగు ఎకరాల్లో అధిక సాంద్రత మామిడి సాగును ప్రారంభించారని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ మాట్లాడుతూ... రైతులు ఆధునిక సాంకేతికతను, డ్రిప్ సదుపాయాలను ఉపయోగించి పండ్ల తోటలను అభివృద్ధి చేయాలని సూచించారు. ఉలవ వంటి పచ్చిరొట్టలు, నవధాన్యాలు భూమిలో కలపడం, వర్షపు నీటి కోసం ఇంకుడు గుంతలు నిర్మించడం వంటి చర్యల ద్వారా భూసారం పెరుగుతుందని, వ్యవసాయం లాభసాటిగా మారుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకం ద్వారా అందిస్తున్న సదుపాయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రైతులతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఏపీఎంఐపి పిడి సుదర్శన్, ఆర్డీవో సువర్ణ, మండల ఉద్యాన అధికారి నవీన్ కుమార్, వ్యవసాయ అధికారి నటరాజ్, తాసిల్దార్లు, ఉపాధి హామీ, ఉద్యాన వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోతారెడ్డి-రామిరెడ్డి రామాలయంలో ఘనంగా గీతా జయంతి వేడుకలు

**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ డిసెంబర్ 02:** స్థానిక సత్తి పోతారెడ్డి తేతలి రామిరెడ్డి రామాలయంలో ఘనంగా గీతాజయంతి వేడుకలు నిర్వహించారు. గీతా జయంతి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు శ్రీ కృష్ణ భగవానుడు అలంకరణ 700 శ్లోకాల భవద్గీత సామూహికపారాయణ వేదాంతం భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులు పూజా కార్యక్రమాల అనంతరం స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

